పీఎం వర్చువల్ మీటింగ్‌కు ఏర్పాట్లు

కడ్తాల్, జనవరి 14: ధర్తి ఆబ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీఎం నరేంద్రమోదీ గిరిజనులు, ఎరుకలు, చెంచులతో నిర్వహించనున్న వర్చువల్ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కడ్తాల్‌లోని గిరిజన బాలుర వసతి గృహంలో రంగారెడ్డి జిల్లాలోని ఎస్టీలకు పీఎం తన ప్రసంగాన్ని వినిపిస్తారని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎస్టీల అభ్యున్నతికి సమావేశంలో ప్రణాళికలు రూపొందించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, డీటీడీవో రామేశ్వరిదేవి, ఏటీడీవో వెంకటయ్య, ట్రైకార్ శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొంటారని వార్డెన్ రాములు వివరించారు.

హెల్త్ కోర్సులకు దరఖాస్తు గడువు పొడిగింపు

వికారాబాద్, నవంబర్ 14: జిల్లాలో హెల్త్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20వరకు గడువును పొడిగిస్తూ పారా మెడికల్ బోర్డు నిర్ణయం తీసుకున్నదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో డీఎల్‌ఎంటీలో 30 సీట్లకు 25 దరఖాస్తులు,డీడీఐఏఎల్‌వైలో 30 సీట్లకు ఐదు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణతతో రెండేండ్ల డిప్లొమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.6వేలు ఈపాస్ ద్వారా తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు.

రేపు దివ్యాంగులకు ఆటల పోటీలు

వికారాబాద్, నవంబర్ 14 : మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 16న ఉదయం 9 గంటలకు వికాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. పరుగు పందెం, షార్ట్ పుట్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, నవంబర్ 14 : తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ద్వారా నిర్వహించే ఐఈఎల్‌టీఎస్, జీఆర్‌ఈత, టోఫెల్ పరీక్షలకు విదేశాల్లో ఉచిత కోచింగ్ అందిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి హన్మంత్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మైనారిటీ అభ్యర్థులు (ముస్లిం, సిక్కు, క్రిస్టియన్, జైన్, బౌద్ధ, పార్సీ) విద్యార్హత జిరాక్స్ కాపీ లు (పది, ఇంటర్, డిగ్రీ) ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాటు అవసరమైన పత్రాలను నిజామియా కాంప్లెక్స్, గన్ ఫౌండ్రీ అబ్దుస్, హైదరాబాద్‌లో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 23236112-040, ఈమెయిల్ ఐడీ directormsccctelangana@gmail.comని ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయం త్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు చదువే ఆయుధం

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఘనంగా బాలల దినోత్సవం
- విజేతలకు బహుమతులు అందజేత

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, నవంబర్ 14: విద్యార్థులకు చదువే ఆయుధమని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం పట్టణంలోని సంగెం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ బాలల దినోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మార్చ్ ఫాస్ట్ ద్వారా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చాచా నెహ్రూ పుట్టిన రోజును జరుపుకోవడం సంతోషకరమన్నారు. బాగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఏమా త్రం అశ్రద్ధ చేయకుండా ఇష్టపడి చదివి ఉన్న త శిఖరాలను చేరుకోవాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి చదువులో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అంతకు ముందు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలను సందర్శించారు. ఇక్కడ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, కాంతారావు, శ్రీకాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టండి

కొడంగల్ : పట్టణ పరిధిలో నర్సింగ్ కళాశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కళాశాల నిర్వహణలో భాగంగా గురువారం పట్టణానికి విచ్చేసిన కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్‌లో నర్సింగ్ కళాశాలను మంజూరు చేసిందని, ఇందుకుగాను 60 మంది విద్యార్థులకు తరగతి గదులతోపాటు వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం వాడుకలో లేని గదులను నర్సింగ్ కళాశాల నిర్వహణకు వాడుకోవాలని, ఇందుకుగాను వాటి మరమ్మతులు చేపట్టేందుకు ఎంత ఖర్చవుతుందో అంచనాలు రూపొందించి నివేదిక అందించాలని సూచించారు. కళాశాలతోపాటు వసతి గృహానికి సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీఎస్ఎంఐడీసీ డిప్యూటీ ఇంజినీర్ సత్యనారాయణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వికారాబాద్ : జిల్లాలో ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు ప్రతి కేంద్రాన్ని సందర్శించి అక్కడ సీసీ కెమెరాలు, ఫర్నిచర్, లైట్స్, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, విద్యుత్ తదితర సదుపాయాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయన్నారు. 18న మధ్యాహ్నం పరీక్ష ఉంటుందని వివరించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఆ తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇవ్వరాదని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సజావుగా పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ తదితర వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్నాపత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులు ఇతరులతో పరీక్ష రాయించేందుకు అనుమతి కోరితే ఈసారి కొత్తగా అమల్లోకి వచ్చిన నిబంధనను అనుసరించాలన్నారు. 24 గంటల ముందుగా దివ్యాంగ అభ్యర్థులతో పరిచయం చేయించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరీక్ష పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జూమ్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, పరిశీలకులు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ హుస్సేన్, సూపరింటెండెంట్ నేహమత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు లేదు, రుణమాఫీ కాలే..

రైతు రాములుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పరిగి, నవంబర్ 14: తనకు రుణమాఫీ కాలేదని పరిగి మండలం లక్నాపూర్ గ్రామానికి చెందిన రైతు బాపురం రాములు పేర్కొన్నారు. లగచర్ల ఘటనకు సంబంధించి అరెస్టు చేసిన రైతులను పరిగి సబ్‌జైలులో కలిసేందుకు గురువారం పరిగికి వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని రైతు రాములు కలిశారు. ఈ సందర్భంగా రుణమాఫీ అయిందా అని అడుగగా తనకు రుణమాఫీ కాలేదన్నారు. రైతుబంధు వచ్చిందా అని అడిగితే ఈ సీజన్‌కు రైతుబంధు రాలేదని రైతు రాములు పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఇలా ఉందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

రెండు నెలల్లో పరిష్కరించాలి

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 7600 ధరణి దరఖాస్తులపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఆదిబట్ల, నవంబర్ 14: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వచ్చే రెండు నెలల్లో పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం జిల్లా సమీకృత సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యల పరిష్కారంపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సెక్షన్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 7600 ధరణి దరఖాస్తులను పరిశీలించి వచ్చే రెండు నెలల్లో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజు వారీగా లక్ష్యాన్ని నిర్ణయించుకొని జనవరి 15లోపు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌వో సంగీత, ఏవో సునీల్, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

సాగు అనుబంధాలపైనే అధిక ఉపాధి

ఐటీ అగ్రిబిజినెస్ హెడ్ డా.శివ కుమార్

సదస్సులో మాట్లాడుతున్న ఐటీ అగ్రి బిజినెస్ హెడ్ డా. శివ కుమార్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 14: దేశంలో ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఎక్కువ ఉపాధి అవకాశాలున్నాయని, అందుకు వాతావారణ పరిస్థితులతో పాటు రైతు కుటుంబాలలో యువత ఆయా రంగాలలో ఆసక్తి చూపుతున్నారని ఐటీ, అగ్రిబిజినెస్ సంస్థ హెడ్ డా.శివ కుమార్ పేర్కొన్నారు. నార్మ్‌లో మూడు రోజులుగా సుస్థిర వ్యవసాయంపై జరుగుతున్న సదస్సు గురువారం ముగిసింది. ఇందులో భాగంగా ఐటీ, అగ్రి బిజినెస్ సంస్థ హెడ్ డా.శివ కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాల వనరులనే యువత ఉపాధిగా మలుచుకుంటూ, తమతో పాటు మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ విద్య, ఉపాధి రంగాలలో యువత ప్రాధాన్యత పెరిగింది. వారి ఆలోచనల ఫలితం ఎలక్ట్రిక్ వాహనాలు, రిమోట్ యంత్రాలు, కూరగాయలు, పండ్ల తోటలు, పాల ఉత్పత్తులతో ప్రత్యక్ష, పరోక్షంగా నూతన మార్పులు తీసుకు వస్తున్నారు. రైతులకు లాభదాయక సౌర కుటీరం, చిరు ధాన్యాలతో రుచికరమైన తినుబండారాలు తదితర రంగాలలో ఉపాధి పొందవచ్చున్నారు. దేశంలో ఆహార ధాన్యాల కొరత ఉందని, ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉందన్నారు. మన వద్ద వాతావరణ పరిస్థితులు, నేలలు అనుకూలంగా ఉన్నా రైతాంగంలో మార్పు అవసరమన్నారు. నార్మ్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ఆహార భద్రత పట్ల శాస్త్ర వేత్తలు పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని వంగడాలను కనుగొనడం, రైతులను చైతన్యం చేయడం, వ్యవసాయ అనుబంధ రంగాలపైనే మరింత దృష్టి పెట్టడం అవసరమన్నారు. దాదాపు 50కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. కాగా, స్థానిక వాతావరణం జాతరలా తయారైంది. వ్యవసాయ యాంత్రీకరణలో ఎలక్ట్రిక్ వాహనాలను, డ్రోన్‌ను, మినీ ట్రాక్టర్, దుక్కి దున్నడం, విత్తనం వేయడం, కలుపు తీత, పురుగు మందుల పిచికారీ, పంట కోత, మార్కెట్‌కు ధాన్యాన్ని చేరదీయడం వంటి తదితర యంత్ర సామగ్రిని ఇక్కడి స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచారు.

అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదు

వికారాబాద్: కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

వికారాబాద్, నవంబర్ 14: ఉద్యోగులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో ఆయా శాఖల ఉద్యోగులు విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీవోఎస్ రాష్ట్ర పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేయాలన్నారు. కలెక్టర్‌పై దాడికి నిరసనగా నాలుగు రోజుల నుంచి ఉద్యోగులందరూ మధ్యాహ్నం సమయంలో నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, జిల్లా కోశాధికారి రమేశ్, సంయుక్త కార్యదర్శి హీరాలాల్, తాలూకా ప్రెసిడెంట్ మల్లేశం, పరిగి తాలూకా ప్రెసిడెంట్ వెంకటేశ్, క్లాస్ ఫోర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాల కృష్ణ, పెన్షనర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి పట్ల నిరసన

షాద్‌నగర్‌టౌన్ : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులపై రెండ్రోజుల క్రితం లగచర్ల గ్రామస్తులు దాడి చేయడంపై గురువారం షాద్‌నగర్ తాలుకా ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవో ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ కోసం గ్రామస్తులతో మాట్లాడేందుకు వెళ్లిన అధికారులపై దాడి చేయడం సరికాదన్నారు. అధికారులు ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తారని, ప్రజలతో అధికారులకు ఎలాంటి భేదాభిప్రాయాలు ఉండవన్నారు. ప్రభుత్వ అధికారులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవో నాయకులు ఆనంద్‌సింగ్, శ్రీనివాస్, శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది వేణుమాధవ్, సూర్యప్రకాశ్, రమేశ్, నరేశ్, రామచందర్, నరసింహ, శ్రీను, జ్యోతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్కారుదే బాధ్యత

పరిగి : దుద్యాల మండల పరిధిలోని లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం పరిగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యంతోనే ఈ ఘటన జరిగిందన్నారు. ఒకవైపు కలెక్టర్ దాడి జరగలేదని స్వయంగా సామాజిక బాధ్యతతో ప్రకటించినప్పటికీ ప్రభుత్వం, పోలీసు అధికారులు కలెక్టర్‌పై దాడి పేరుతో గిరిజనులు, రైతులను భయభ్రాంతులకు గురిచేసి, ఇదే అదనుగా బలవంతంగా పేద రైతుల భూములు లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఘటనలో లేని అమాయకపు రైతులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని ఆయన ఖండించారు. కొడంగల్, దుద్యాల, బొంరాస్‌పేట్ మండలాల్లో ఇంటర్‌నెట్ కట్ చేసి ఆ గ్రామాల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను, గిరిజనుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదన్నారు. ఆరు నెలలుగా తమకు ఫార్మా కంపెనీ వద్దని లగచర్ల, పోలేపల్లి, పులిచర్లగుంట, రోటిబండతండా రైతులు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొడంగల్‌లో ఉన్న 1154 ఎకరాలు తీసుకొని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూములు కోల్పోతున్న రైతులను సంఘటితం చేసి ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, సత్యయ్య, రఘురాం, సత్యయ్య, శేఖర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్: తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవో నాయకులు

పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

ఏఎన్ఎంల జీతాలు చెల్లించాలి

గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌కు వినతిపత్రం ఇస్తున్న జీవీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు

కులకచర్ల, నవంబర్ 14 : గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే ఏఎన్ఎంల జీతాలు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. గురువారం గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే ఏఎన్ఎంలతో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు గత పది నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సానుకూలంగా స్పందించి త్వరలో జీతాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం గిరిజన నాయకులతోపాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, కరీంనగర్, వికారాబాద్, హనుమకొండకు చెందిన ఏఎన్ఎంలు సెక్రటరీని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. రూ.14 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు అంబర్‌సింగ్‌నాయక్, వివిధ జిల్లాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కష్టపడితే ఏదైనా సాధ్యం

సమావేశంలో మాట్లాడుతున్న అంతర్జాతీయ అథ్లెటిక్ చాంపియన్ నందిని

వికారాబాద్, నవంబర్ 14: కష్టపడితే అసాధ్యం కూడా సుసాధ్యం అవుతుందని అంతర్జాతీయ అథ్లెటిక్ చాంపియన్ నందిని అన్నారా తెలిపారు. గురువారం వికారాబాద్ శివారెడ్డిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో పదో జోనల్ మీట్ ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఎంత కష్టమైనా ఇష్టంతో సాధన చేసినట్లయితే తప్పనిసరిగా లక్ష్యాన్ని ఛేదించవచ్చని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఇదొక సువర్ణ అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకున్నట్లయితే ప్రపంచం గర్వించేలా అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చన్నారు. గురుకుల పాఠశాలలో ఉన్న సౌకర్యాలు మరెక్కడా లేవని.. ఇక్కడి ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు వారి నైపుణ్యాలను పూర్తిగా రంగరించి మనకు విద్యాబోధన రూపంలో శిక్షణ ఇస్తారన్నారు. వారి శిక్షణను సరైన విధంగా వినియోగించుకున్నట్లయితే మనమంతా ఉన్నత స్థాయికి చేరుకుంటామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు చెప్పినట్లు మనం పూర్తిగా ఏకాగ్రతతో సాధన చేసినట్లయితే ప్రపంచం నలుమూలలా మన పేరు, దేశం పేరు అలాగే మన పాఠశాల పేరు మార్మోగుతుందని వివరించారు.

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏదైనా సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులు చెప్పినట్టుగా నడుచుకోవాలన్నారు. ప్రతి ఆలోచన విజయం వైపు దూసుకెళ్లేలా ఉండాలన్నారు. వైద్యపరంగా విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలైనా తప్పనిసరిగా అందిస్తానని చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యం వైపే పయనించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్ పాల్గొని క్రీడాకారులను, వైద్య సిబ్బందిని అభినందించారు.

బీజేపీ నేత, నందు ఫౌండేషన్ చైర్మన్ వడ్ల నందు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శారీరక, మానసిక ఉల్లాసానికి, దారుఢ్యానికి ఆటలే కీలకమన్నారు. విద్యార్థులకు ఎల్లవేళలా అండదుబాటులో ఉండి ఎలాంటి సహకారమైనా అందిస్తానని ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడినందుకు ప్రతిఫలంగా విజేతలుగా నిలిచారన్నారు. విజేతలను తయారు చేసినందుకు వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విజేత జట్లను అభినందిస్తూ ఈ జోనల్ మీట్‌ను విజయవంతం చేయడానికి కృషిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుకుంటేనే మంచి భవిష్యత్

- న్యాయసేవా సాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్
- జడ్పీ బాలికల పాఠశాలలో బాలల దినోత్సవం
- పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయసేవా సాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్

వికారాబాద్, నవంబర్ 14 : కష్టపడి చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని న్యాయసేవా సాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ తెలిపారు. గురువారం జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవానికి న్యాయమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతు లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బాలికలు చదువుపై దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదన్నారు. కష్టపడి చదివితేనే మంచిస్థాయికి చేరుకుంటామని, అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. మిమ్మల్ని ఎవరైనా టచ్ చేస్తే అది గుడ్ టచ్చా.. బ్యాడ్ టచ్చా గమనించాలన్నారు. బ్యాడ్ టచ్ అనిపిస్తే 1098కు కాల్ చేసి చెప్పాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాములు, న్యాయవాది రాజేశ్వర్, హెచ్ఎంలు శ్రీశైలం, వీరేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

ధారూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

ధారూరు, నవంబర్ 14 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకుండా కష